


# నల్లగొండ సత్యనిష్ఠ

నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి భువనగిరి

26 బుధవారం ఆగస్టు 2026 పేజీలు: 3


## కూనవరం పడవ ప్రయాణికులు నుండి ప్రజాధనం దోపిడీ

- కలెక్టరేట్ ముందు ఆదివాసీ సంక్షేమ పరిషత్ నిరసన:
- పడవ ఫెర్రీ కాంట్రాక్టర్
- బినామీ దందాపై సమగ్ర విచారణకు డిమాండ్



విఆర్ పురం-సత్యనిష్ఠ

పోలవరం జిల్లా కూనవరం-రుద్రంకోట గోదావరి నది దాటు పడవ (ఫెర్రీ) పాయింట్ వేలం పాట పేరుతో సాగుతున్న భారీ ఆర్థిక అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలపై ఆదివాసీ సంక్షేమ పరిషత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రంపచోడవరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక పి జి ఆర్ ఎస్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మరియు జిల్లా జాయింట్ కలెక్టర్లకు ఆదివాసీ సంక్షేమ పరిషత్ పోలవరం జిల్లా అధ్యక్షులు కూర చిట్టి బాబు గారి ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. కూనవరం ప్రాంతంలో సామాన్య ఆదివాసీలను, ప్రయాణికులను నిలువునా దోపిడీ చేస్తున్న బినామీ పడవ ఫెర్రీ కాంట్రాక్టును తక్షణమే రద్దు చేసి, బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కూనవరం-రుద్రంకోట మధ్య నడుస్తున్న పడవ ప్రయాణికుల వద్ద నుండి నిర్దేశించిన ప్రభుత్వ ధరల కంటే రెట్టింపు మొత్తంలో చార్జీలు వసూలు చేస్తూ కాంట్రాక్టర్ దౌర్జన్యానికి పాల్పడుతున్నారని జిల్లా అధ్యక్షులు కూర చిట్టి బాబు ఆరోపించారు. ప్రభుత్వ నియమావళి ప్రకారం ఒక వ్యక్తికి 50 చార్జీ ఉండగా 100, ద్విచక్ర వాహనానికి 50 స్థానే 100 చొప్పున అక్రమంగా దండుకుంటున్నారని మండిపడ్డారు. ఈ పడవ పాట కాంట్రాక్టు వెనుక అసలైన సూత్రధారి ఒక నాన్-ట్రైబల్ ప్రభుత్వ ఉద్యోగి అని, ఆదివాసీ చట్టాలను ఎల్ టి ఆర్ అండ్ పేసా తుంగలో తొక్కి ఆదివాసీ మహిళ పేరుతో రూ. 89.30 లక్షల భారీ మొత్తానికి బినామీగా పాట పాడించి వెనుక ఉండి నడిపిస్తున్నారని పత్రికాముఖంగా బహిర్గతం చేశారు. ఈ దోపిడీ దందా అంతా స్థానిక పంచాయతీ అధికారుల కనుసన్నల్లోనే బహిరంగంగా సాగుతుండటం శోచనీయమని నాయకులు విమర్శించారు. ఫెర్రీ పాయింట్ వద్ద నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఆమోదిత రేట్ల పట్టిక బోర్డును కూడా ఏర్పాటు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శన మని మండిపడ్డారు. ఇదంతా అధికారులకు తెలిసే జరుగుతోందని, ఈ అక్రమ దోపిడీని ఎవరైనా ప్రయాణికులు ప్రశ్నిస్తే వారిపై కాంట్రాక్టర్ మనుషులు తీవ్రస్థాయిలో దురుసుగా ప్రవర్తిస్తూ, భయాందోళనలకు గురిచేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో వేలేరుపాడు మండల పరిధిలో పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు సంబంధించిన సుమారు రెండు కోట్ల రూపాయల పునరావాస పరిహారాన్ని స్వాహా చేసి సస్పెన్షన్‌కు గురైన సదరు నాన్-ట్రైబల్ ఉద్యోగి, ప్రస్తుతం ఈ ఫెర్రీ దందాకు అసలు యజమానిగా వ్యవహరించడం ఆదివాసీ ప్రాంతాల స్వయంపాలనకు తీవ్ర విఘాతమని వారు హెచ్చరించారు. ఈ అక్రమాలకు ఏజెంట్‌గా వాడుకుంటున్న ఆదివాసీ మహిళా కుటుంబం సంపాదించిన ఆస్తులపై తక్షణమే ఏసీబీ ఏసిబి మరియు సిబిసిఐడి సి బి సి ఐ డి లతో లోతుగా ఎంక్వైరీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రజాధనాన్ని దోచుకుంటూ రాజ్యాంగబద్ధమైన ఆదివాసీ హక్కులను హరిస్తున్న ఈ కాంట్రాక్టును రద్దు చేసి, నిజమైన ఆదివాసీ సహకార సంఘాలకు ఈ ఫెర్రీ నిర్వహణ బాధ్యతలను అప్పగించకపోతే ఆదివాసీ సమాజాన్ని సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని కూర చిట్టి బాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ నాయకులు పీటా ప్రసాద్, గంగా భవాని తదితరులు పాల్గొన్నారు.

## కొల్లాపూర్‌లో రూ.171.75 కోట్ల రహదారి అభివృద్ధి పనులు

**మంత్రి కోమటిరెడ్డి శంకుస్థాపన**



**హైదరాబాద్- ఆగస్టు 25 ( సత్య నిష్ఠ):** కొల్లాపూర్ నియోజకవర్గంలో వనపర్తి-I ప్యాకేజీ కింద హామ్ ఫేజ్-I & IIలో భాగంగా చేపట్టనున్న ఏడు కీలక రహదారి అభివృద్ధి పనులకు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శంకుస్థాపన చేశారు. రూ.171.75 కోట్ల అంచనా వ్యయంతో నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లోని ప్రధాన రహదారులను రెండు లేన్లుగా విస్తరించి, అవసరమైన చోట్ల పటిష్టపరిచే పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ ప్యాకేజీలో పెంట్లవెల్లి ఎక్స్ రోడ్--శ్రీరంగాపూర్ మీదుగా కొండూరు--తూముకుంట రహదారి అభివృద్ధికి రూ.13.96 కోట్లు, మరో ప్యాకేజీకి రూ.31.83 కోట్లు, పెద్దకర్పాముల--అంబట్పల్లి మీదుగా దేదిన్నేపల్లి రహదారికి రూ.16.48 కోట్లు, రాజాపూర్--ఏదుల రహదారికి రూ.19.23 కోట్లు, కొల్లాపూర్--లింగాల రహదారికి రూ.44.93 కోట్లు, తీగలపల్లి--ఏదుల రహదారికి రూ.17.85 కోట్లు, షానైలపల్లి--గొరెడ్డిపల్లి రహదారికి రూ.27.47 కోట్లు కేటాయించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించేందుకు పెద్ద ఎత్తున నిధులు వెచ్చిస్తోందన్నారు. నాణ్యమైన రహదారుల నిర్మాణంతో ప్రజల ప్రయాణం సులభతరం కావడంతో పాటు వ్యవసాయం, వ్యాపారం, విద్య, వైద్య సేవలకు రాకపోకలు మరింత మెరుగుపడతాయని పేర్కొన్నారు. ఈ రహదారి అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత కొల్లాపూర్ నియోజకవర్గంలోని గ్రామాలు, మండలాల మధ్య రవాణా అనుసంధానం బలోపేతం కానుంది. ప్రజలకు సురక్షితమైన, వేగవంతమైన ప్రయాణ సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో పాటు ప్రాంతీయ అభివృద్ధికి ఈ ప్రాజెక్టులు కీలకంగా మారనున్నాయి.

## అక్రెడిటేషన్ కాల పరిమితి పెంపు

**నల్గొండ-ఆగస్టు 25 (సత్యనిష్ఠ)**

జర్నలిస్టుల పాత అక్రెడిటేషన్ కార్డుల విషయంలో తెలంగాణ హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. పాత కార్డుల కాలపరిమి తిని సెప్టెంబర్ 15వ తేదీ వరకు పొడిగించింది. జీవో 252, దాని సవరణ జీవో 103ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై ఇవాళ విచారణ జరిపిన హైకోర్టు ఈ మేరకు తాజా ఆదేశాలు జారీ చేసింది.

## తప్పుడు వార్తలతో పరువు తీశారు

- మీడియా ఛానల్స్ పై చర్యలు తీసుకోవాలని చండూరులో ఆర్యవైశ్యుల ఆందోళన



**చండూరు-సత్యనిష్ఠ:** మున్సిపాలిటీ పరిధిలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఇటీవల జరిగిన వడ్ల దొంగతనం వ్యవహారంలో, సరైన ఆధారాలు లేకుండా ప్రముఖ వ్యాపారి తేలుకుంట్ల జానయ్య అనే వ్యక్తిపై కొన్ని టీవీ చానల్స్ లో మరియు వాట్సాప్ గ్రూపుల్లో తప్పుడు ప్రచారం చేయడం కలకలం రేపింది. తాను చేయని నేరానికి తనను బాధ్యుడిని చేస్తూ కథనాలు ప్రసారం చేసి సమాజంలో తన పరువుకు భంగం కలిగించారని జానయ్య తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ అసత్య ప్రచారానికి నిరసనగా మంగళవారం చండూరు పట్టణంలోని ప్రధాన సెంటర్‌లో ఆర్యవైశ్య సంఘం నాయకులు, స్థానికులతో కలిసి ఆయన భారీ ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. మీడియా ఛానల్ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిందని, నిజానిజాలు తెలుసుకోకుండా వార్తలు రాయడం దారుణమని ధర్నాలో పాల్గొన్న ఆర్యవైశ్య సంఘం పెద్దలు మండిపడ్డారు. అనంతరం, బాధితుడు తేలుకుంట్ల జానయ్య ఆర్యవైశ్య సంఘం నాయకులతో కలిసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సదరు కొన్ని టీవీ ఛానల్స్ మరియు తప్పుడు ప్రచారం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

**ఆర్యవైశ్య సంఘం డిమాండ్:**

ఎలాంటి ప్రాథమిక విచారణ లేకుండా జానయ్యపై తప్పుడు వార్తలు ప్రసారం చేసి ఆయన గౌరవానికి భంగం కలిగించిన మీడియా చానల్స్ పై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే బాధితుడికి బహిరంగ క్షమాపణ చెప్పాలని సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, వ్యాపారులు మరియు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జానయ్యకు మద్దతు తెలిపారు.

## చేతివృత్తిదారులకు తొలి ప్రాధాన్యత కల్పించాలి: కొండ హరీష్ గౌడ్



సత్యనిష్ఠ ఆర్ సి హుజుర్నగర్

హుజూర్ నగర్ పట్టణంలోని ఆర్అండ్‌బీ శాఖకు సంబంధించిన స్థలంలో నూతనంగా నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌లో స్థానికంగా 30, 40 సం. రాలుగా ఉన్నటువంటి చిన్న చిన్న కులవృత్తులు, చేతివృత్తులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వారికి తొలి ప్రాధాన్యత కల్పించాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో హుజూర్ నగర్ పట్టణ అధ్యక్షులు కొండ హరీష్ గౌడ్ కోరారు మంగళవారం ఆర్అండ్‌బీ శాఖ డీఈఈ రమేష్ కి వినతిపత్రం అందించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హుజూర్ నగర్ పట్టణంలో ఆ ప్రాంతంలో సుమారు 30, 40 సం. రాలుగా స్థానికంగా జీవిస్తూ, తరతరాలుగా చిన్న చిన్న కులవృత్తులు, చేతిపనులు చేసుకుంటూ తమ కుటుంబాలను పోషించుకుంటున్న అనేక మంది ప్రస్తుతం జీవనోపాధి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆర్అండ్‌బీ శాఖ నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌లో వీరికి స్థానిక వృత్తిదారులు, చిన్న వ్యాపారులకు ప్రాధాన్యత కల్పిస్తే వారి కుటుంబాలకు స్థిరమైన జీవనోపాధి లభిస్తుందని అన్నారు. కావున షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపుల కేటాయింపులో స్థానికులకు, ముఖ్యంగా తరతరాలుగా కుల వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న బాధితులకు తొలి ప్రాధాన్యత ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానికుల సమస్యను అధికారులు సానుకూలంగా పరిశీలించి, న్యాయం జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో బిజెపి ఆధ్వర్యంలో బాధితుల పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు కొండ హరీష్ గౌడ్ తో పాటు బిజెపి లీగల్ సెల్ నాయకులు పిడమర్తి చంద్రయ్య, మేళ్లచెరువు లక్ష్మణ్, చుక్క హరీష్, సతి బల్వంత్ సింగ్ మరియు బాధితులు మంగమ్మ, నాగమణి, మంగమ్మ, మేరీ, ఈశ్వరమ్మ, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## పెన్పహాడ్ జిల్లా పోటీల్లో కోదాడ క్రీడాకారుల సత్తా బహుమతులు అందజేసిన రావెళ్ల సీతారామయ్య



కోదాడ ఆగస్టు 25 (సత్యనిష్ఠ): హుజూర్ నగర్ లో నిర్వహించిన జిల్లా స్థాయి పెన్షనర్ల క్రీడా మరియు సాంస్కృతిక పోటీలలో కోదాడ యూనిట్ సభ్యులు ఘనవిజయం సాధించారు. ఈ పోటీలలో ప్రతి భ చాటిన కోదాడ పెన్షనర్లు పలు విభాగాల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులు కైవసం చేసుకున్నారు. క్యారమ్స్ పోటీలలో అత్యుత్త మ ప్రతిభ కనబరిచిన ఎ.లక్ష్మీనరసయ్య, కె.గోపాల్ రావు, సిహెచ్. వరప్రసాదరావు, ఎస్కె. హుస్సేన్ జట్లు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. సాంస్కృతిక పోటీలకు పాటల విభాగంలో బాదే సత్యనా రాయణ ప్రథమ బహుమతి సాధించారు. అలాగే పద్యాల విభాగం లో పి.జగన్మోహన్‌రావు ప్రథమ బహుమతి గెలుపొందారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతు లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోదాడ యూనిట్ అధ్యక్షుడు వేనేపల్లి శ్రీనివాస రావు, కార్య దర్శి పందిరి రఘువర ప్రసాద్, ఆర్థిక కార్యదర్శి తమ్మన బోయిన వీరబాబు, కార్యవర్గ సభ్యులు ఎస్కె. బాలేమియా తో పాటు అధిక సంఖ్యలో పెన్షనర్లు పాల్గొన్నారు.

# మహా ధర్నాను జయప్రదం చెయ్యండి

- మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడియం వెంకటరెడ్డి

సత్యనిష్ఠ ఆర్ సి హుజుర్నగర్

రైతంగా సమస్య ల పరిష్కారం కోసం సాగర్ నీటిని విడుదల చెయ్యాలని కోరుతూ బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సూర్యాపేట ఎమ్మెల్యే గుంత కండ్ల జగదీశ్వర్ రెడ్డి, హుజుర్నగర్ నియోజకవర్గ బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జి ఒంటెద్దు నర్సింహా రెడ్డి గారి ఆదేశాల మేరకు నేరేడుచర్ల గరిడేపల్లి పాలకీడు మండలం ప్రజల పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చెయ్యాలని హుజుర్నగర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడియం వెంకట్ రెడ్డి కోరారు మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం లో ఆయన పాల్గొని మాట్లడుతూ కాంగ్రెస్ పార్టీ



సాగర్ నీటిని విడుదల చేయకుండ కాలయాపనా చేస్తుంది అని దుయ్య బట్టరు 24గంటల కరెంట్, ఇవ్వాలని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ బి ఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాట్లు తెలిపారు కావున గరిడేపల్లి మండల, రైతులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, సానుభూతిపరులు, అందరు ధర్నా కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని కోరారు ఈ కార్యక్రమం సర్వారం పిఎసిఎస్ మాజీ చైర్మన్ వీరం రెడ్డి శంబిరెడ్డి, మాజీ మండల ప్రధాన కార్యదర్శి మన్సూర్ అలీ, పెండం ధనయ గౌడ్, బండ్ల గోపాల్,కానుగ నగేష్ పెండెం వినోద్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీలు సంక్షేమ పథకాలను పోరాడి సాధించుకోవాలి

- కేదాసి మోహన్ మాదిగ రాష్ట్ర అధ్యక్షులు. చింతాబాబు.

కోదాడ – ఆగస్టు 25 (సత్యనిష్ఠ):పట్టణంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మేడి పాపయ్య మాదిగ ఆదేశాల మేరకు అంబేద్కర్ అభయహస్తం అమలుకై ఉద్యమించాలని, చలో కోదాడ బహిరంగ సభను నిర్వహించి విజయవంతం విజయవంతం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు కేదాసి మోహన్ మాదిగ. జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ చింతాబాబు మాదిగ మాట్లాడుతూ అంబేద్కర్ అభయహస్తం హామీలను అమలు చేయాలని డిమాండ్ తో పోరాడతామన్నారు. గత 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగలు పోరాడారని, వర్గీకరణ సాధించి నప్పటికీ దళితుల సంక్షేమానికి సంబంధించిన హామీలు పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రభుత్వం అంబేద్కర్ అభయ హస్తం



పథకాన్ని అమలు చేసి దళిత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని కోరారు. అంబేద్కర్ అభయహస్తం కింద రూ.12 లక్షల ఆర్థిక సహాయం అందించాలని, దళితులకు ఉన్నటు వంటి అసైన్డ్ ల్యాండ్స్ కు అమ్ము కునే హక్కు కల్పిస్తామని ప్రభుత్వం చేవెళ్ల ఎస్సీల డిక్లరేషన్ లో హామీ ఇవ్వడం జరిగింది. దానికి సంబంధించి ప్రభుత్వం వెంటనే జీవో విడుదల చేయాలి. భూమి లేని ఎస్సీ కుటుంబా లకు భూమి, విద్యార్థు లకు మెరుగైన విద్యా సౌకర్యాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ లు, విదేశీ విద్యకు ఆర్థిక సహాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి మండలంలో గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయడంతో పాటు దళితుల సమస్య లను పరిష్కరించాలని కోరారు. హామీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే దళితుల హక్కుల కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. బహిరంగ సభను విజయవంతం చేసేందుకు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి రావాడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సీనియర్ నాయకులు బాణాల అబ్రహం, నాయకులు పోలంపల్లి శ్రీనివాస్, కనుకు జానయ్య, రావూరి విజయ భాస్కర్, బల్లూరి హుస్సేన్, మరికంటి అంబేత్కర్, మిద్దె వెంకటేశ్వర్లు, మేళ్లచెరువు ముక్కంటి, కడప పెంటయ్య, కర్ల కాంతారావు, పల్లేటి లక్ష్మణ్, గంగాధర రమణ, కందుకూరు నాగేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

## వార్డు మెంబర్ల ఫోరం కమిటీ అధ్యక్షులుగా మిరియాల శ్రీను ఏకగ్రీవ ఎన్నిక

కోదాడ – ఆగస్టు 25 (సత్యనిష్ఠ) నడిగూడెం మండలం లోని రత్నవరం గ్రామానికి చెందిన మిరియాల శ్రీను వార్డు మెంబర్ల ఫోరం కమిటీ మండల అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు నియామక పత్రాన్ని జిల్లా ఇన్‌చార్జ్ షేక్ నజీర్ పాషా చేతుల మీదుగా అందజేశారు. మండలం లోని వార్డు సభ్యుల సమస్యల పరిష్కారం, వారి హక్కుల పరిరక్షణ తో పాటు గ్రామాల అభివృద్ధి లో వార్డు మెంబర్ల పాత్రను మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని నూతన మండల అధ్యక్షుడు మిరియాల శ్రీను తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జ్ షేక్ నజీర్ పాషా మాట్లాడుతూ, వార్డు సభ్యుల ఐక్యతకు, వారి



సమస్య లను ఉన్నత స్థాయికి తీసు కెళ్లడానికి ఫోరం సమర్థవంతంగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. మిరియాల శ్రీను నాయకత్వం లో నడిగూడెం మండల ఫోరం మరింత బలోపేతం అవు తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఠాకూర్ నాయక్‌తో పాటు నడిగూడెం మండలంలోని పలు గ్రామాల వార్డు మెంబర్లు పాల్గొన్నారు. మిరియాల శ్రీను ఏకగ్రీవంగా మండల అధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో పలువురు వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు మరియు నాయకులు ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# నీటిపారుదల శాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలి

- **కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్**



**కోదాడ - ఆగస్టు 25 (సత్యనిష్ఠ)** పట్టణ పరిధిలోని ఇరిగేషన్ శాఖ కార్యనిర్వాహక కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, కోదాడ నియోజకవర్గ పరిధిలోని రైతులకు వెంటనే సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని ఇరిగేషన్ శాఖ అధికారులకు కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బొల్లం మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ, నీళ్లు ఇవ్వడం చేతకాని అసమర్థ, అవినీతి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నాగార్జున సాగర్ డ్యాంలో నీళ్లు ఉన్నప్పటికీ ఆయకట్టు ప్రాంతానికి నీళ్లు ఇవ్వకుండా, సొంత జిల్లాకు అన్యాయం చేస్తూ చంద్రబాబు మెప్పు కోసం, తుమ్మల నాగేశ్వర రావు ను ప్రసన్నం చేసు కోవడానికి నల్లగొండ జిల్లా రైతాంగానికి అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. గత జూన్ నెలలో విడుదల చేసిన సాగర్ నీటిని మొత్తాన్ని ఖమ్మం జిల్లాకు పంపించిన ఘనత ఉత్తం కుమార్ రెడ్డిదే నని విమర్శించారు. ఒక వైపు నాగార్జున సాగర్‌కు గండికొట్టే విధంగా పైన పోతిరెడ్డిపాడు నుంచి ఆంధ్ర రాష్ట్రానికి 10 టీఎంసీల నీటిని తీసు కెళ్తుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని అన్నారు. నాగార్జున సాగర్, శ్రీశైలం డ్యామ్‌లలో తెలంగాణకు ఉన్న హక్కులను కేఆర్ఎంబీకి అప్ప జెప్పి తెలంగాణ రైతాంగానికి, నల్లగొండ జిల్లా ప్రజా నీకానికి తీవ్ర అన్యాయం చేశారని ఆయన ఆరోపించారు. ఈ విషయంలో అవగాహన లేకుండా వ్యవ హరిస్తున్న ఉత్తం కుమార్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని, లేని పక్షంలో గవర్నర్ జోక్యం చేసు కుని ఆయన ను బర్తరఫ్ చేయాలని కోరారు. అలాగే ఉత్తం కుమార్ రెడ్డి నిర్వహిస్తున్న పౌరసరఫరాల శాఖ, నీటి పారుదల శాఖల్లో అవినీతి బాగోతంపై విచారణ జరపాలని గవర్నర్‌ను కోరారు.

అధికారాన్ని అడ్డం పెట్టుకొని రైతాంగానికి, ప్రజలకు చేస్తున్న అన్యాయాన్ని గుర్తించి తెలంగాణ రైతాంగానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఒక వైపు నీళ్లు లేక, వర్షాభావ పరిస్థితుల ప్రభావంతో రైతులు గగ్గోలు పెడుతుంటే, యాగాల పేరుతో కాలక్షేపం చేస్తూ రైతులను మభ్య పెడుతున్నారని ఆయన విమర్శించారు. రైతుల బోర్లు, బావులు ఎండి పోయి పంట పొలాలు నెర్రలు బారుతున్న సమయంలో మన నల్లగొండ జిల్లా ఆయకట్టు మీదుగానే ఖమ్మం జిల్లాకు నీళ్లు పంపించి ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతాంగాన్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఈ పరిస్థితికి నీటిపారుదల శాఖ మంత్రి వైఫల్యమే కారణమని విమర్శించారు. ఎస్ఎల్‌బీసీ పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని చెప్పి కమిషన్ల కోసం పనులు ప్రారంభించి నప్పటికీ, సరైన పరిజ్ఞానం లేక పోవడం వల్ల ఎనిమిది మంది కార్మికులు చని పోయారని, వారి మృతదేహాలను కూడా బయటకు తీసుకు రాలేని పరిస్థితి ఏర్పడిందని బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉత్తం కుమార్ రెడ్డి తెలంగాణకు నీటి పారుదల శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించడం వల్ల తెలంగాణ రైతాంగం తీవ్ర సంక్షోభంలోకి, నష్టాల్లోకి వెళ్తోందని అన్నారు. ఇదిలా ఉంటే కాళేశ్వరం, మేడిగడ్డ కుంగి పోయిందని చెబుతూనే వచ్చే నెల జూన్ నాటికి మరమ్మతులు చేపడతా మని చెబుతున్నారని అన్నారు. మరమ్మతులు చేపట్టే అవకాశం ఉన్నప్పటికీ ఇన్ని రోజులు మరమ్మతులు చేయ కుండా తెలంగాణ రైతాంగాన్ని ఇబ్బందు లకు గురి చేస్తున్నారని మండి పడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో డెడ్ స్టోరేజ్‌లో కూడా తెలంగాణ రైతాంగానికి నీళ్లు ఇచ్చి నీటి ఎద్దడి లేకుండా చూడ గలిగిన ఘనత కేసీఆర్ దేనని బిఆర్ఎస్ ప్రభుత్వాని దే నని బొల్లం మల్లయ్య యాదవ్ కొనియాడారు.నాగార్జున సాగర్ నుంచి నీళ్లు ఇవ్వడానికి అవకాశం ఉన్నప్పటికీ ఇవ్వ కుండా కాలయాపన చేస్తున్న ఉత్తం కుమార్ రెడ్డి వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేయాలని, నల్లగొండ జిల్లా రైతాంగానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన చేస్తున్న చౌక బారు రాజకీయాల వల్ల నాగార్జున సాగర్ ఆయకట్టు ప్రాంత మంతా దెబ్బ తింటోందని, నీళ్లకు ఇబ్బంది పడే పరిస్థితి వచ్చిందని అన్నారు. భూగర్భ జలాలు పడి పోయి, నీటితో కళ కళ లాడే చెరువులు, జలాశయాలు ఈరోజు నెర్రలు బారు తున్నాయని తెలిపారు. దీనికి ఉత్తం కుమార్ రెడ్డి వైఫల్యం, అవగాహన రాహిత్యమే కారణమని ఆరోపించారు. కళ్ల ముందు నీళ్లు పోతున్నా నల్లగొండ జిల్లాకు ఇవ్వాల్సిన వాటా కూడా ఇవ్వ కుండా ఉన్న ఉత్తంకుమార్ రెడ్డికి ఆ శాఖలో మంత్రిగా కొన సాగడానికి నైతిక హక్కు లేదని అన్నారు. కావున వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కావున వెంటనే కోదాడ నియోజకవర్గ రైతులు పంట పొలాలను కాపాడు కోవడానికి, భూగర్భ జలాలు పెరగ డానికి, ప్రజల దాహార్తిని తీర్చడానికి అధికారులు చొరవ తీసు కొని నాగార్జున సాగర్ నీటిని విడుదల చేయాలని బొల్లం మల్లయ్య యాదవ్ నీటి పారుదల శాఖ అధికారు లను కోరారు. లేని పక్షంలో బీఆర్ఎస్ పార్టీ పక్షాన ఈ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన తెలిపారు. ఆయన వెంట నియోజకవర్గ ముఖ్య నాయకులు తాళ్లూరు శ్రీనివాస్, నల్ల భూపాల్ రెడ్డి, పాషా, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సారంపల్లి మల్లారెడ్డి మరణం... యావత్ రైతాంగానికి తీరని లోటు

- **రైతు రాష్ట్ర నాయకులు వేముల**



**నల్గొండ- ఆగస్టు 25 ( సత్య నిష్ఠ)** రైతు పక్షపాతిగా అనునిత్యం చేసిన రైతు ఉద్యమాలు చరిత్రలో నిలిచిపోతాయి అఖిల భారత రైతు నాయకుడిగా ఆయన సేవలు అందిస్తూ ఆగస్టు24సోమవారం రోజున ఉదయం3 గంటలకు తిరిగిరాని లోకాలకు వెళ్లడం దేశవ్యాప్తంగా ఉన్న రైతు నాయకులను దుక్కసాగారంలో నిలిపింది అని రైతు రాష్ట్ర నాయకులు,ఎమ్మెల్యే ఎంపీ ఎమ్మెల్సీ పరాజితులు జర్నలిస్ట్ విక్రమ్ రెడ్డి వేముల అన్నారు. అనారో గ్యంతో నిమ్స్ లో చేరిన సారంపల్లి మల్లారెడ్డి చికిత్స పొందుతూ 89వ జెన్మాదినోస్సవానికి ఒక రోజు ముందు మరనిశించడం అత్యంత బాధాక రం అని 12ఏళ్లుగా అనగా2014నుండి వారితో మంచి అనుబంధం రైతు సమావేశాలు ఉద్యమాలలో ఏర్పడింది అని నాలుగేళ్ళ క్రితం వరంగల్ లో జరిగిన ఈఆర్సీ సమావేశంలో ఛైర్మెన్ తో తాను సంభాషిచే సమయంలో ఎక్కడో కూర్చున్న వారు వారికున్న అవగాహన మేరకు వేదికకు చేరుకొని తనకు మద్దతుగా ఎన్నో అంశాలు మాట్లాడి రైతాంగం పక్షాన బలమయిన గొంతులుగా సంయుక్తంగా అది యువ రైతు నేతగా నేను అత్యధిక సీనియర్ నేతగా వారు జోడిగా నిలిచామని వారితో ఉన్నా అనుబంధాన్ని గుర్తు చేసుకొని వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ పార్థీవదేహానికి నివాళులు అర్పించి, వారి కుటుంబానికి ధైర్యం చేకూర్చాలని కోరుకుంటున్నట్లు వారి లేని లోటు పూడ్చలేనిది అయినా వారి ఆశయాల కోసం పనిచేస్తామని పేర్కొన్నారు వారి అంతిమయాత్ర ఆగస్టు25మంగళవారం ఉదయం 06నుండి12గంటల వరకు ప్రజల సందర్శనార్థం హైదరాబాద్ లోని సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో ఉంచి తదనంతరం అంతిమ యాత్ర ప్రారంభం అయి మద్యాహ్నం 3గంటలకు గాంధీ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుంది తదనంతరం వైద్య విద్యార్థుల పరిశోధనార్థం గాంధీ మెడికల్ కళాశాలకు వేలాది మంది సమక్షంలో కుటుంబసభ్యులు ఆయన చివరి కోరికగా అప్పగించడం జరుగిశీది అని తెలిపారు. అంతిమ యాత్రలో రాష్ట్ర వ్యాప్తంగా తరలివచ్చిన సుమారు 3500మంది పాల్గొనగా కళారూపాల తో జోహార్లు తెలుపుతూ ఘన నివాళులు అర్పించడం అయినది అంతకుముందు అన్నిపార్టీల ముక్యులు ఆయన పార్థివ దేహానికి నివాళులు అర్పించి తుది విడ్కోలు పలకడం జరిగింది ముఖ్యమంత్రి సంతాపాన్ని పిసిసి అధ్యక్షుడు మహేష్ గౌడ్ పాల్గొని అందించగా ఆయన ప్రతినిధిగా వేం నరేందర్ రెడ్డి హాజరు అయ్యారు ఇలాంటి నిఖార్సయిన నేత స్పూర్తిగా మరింత మంది నడుచుకోవాల్సిన అవసరం ఎంతయిన ఉన్నది అని అభిప్రాయపడ్డారు.


# ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల విద్యార్థినికి సర్వ్ ది పీపుల్ ఫౌండేషన్ ఆర్థిక చేయూత

**నల్లగొండ --ఆగస్టు 25( సత్యనిష్ఠ ):** ఖమ్మం ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలకు చెందిన గుగులోత్ శృతి అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీలో ఎంఎస్సి మొలెక్యూలర్ బయాల జీలో సీటు సాధించింది. అయితే ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఉన్నత విద్యను కొనసాగించేందుకు ఆమెకు ఎదురైన సమస్యను గుర్తించిన కళాశాల ప్రిన్సిపాల్ రజిని దాతల సహాయం కోసం ప్రయత్నించారు. ఈ సందర్భంగా అదే కళాశాలలో ఎకనామిక్స్ గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్న ప్రొద్దటూరు శ్రావణి స్పందించారు. 2021లో తాను నల్లగొండ ఎకనామిక్స్ ఫోరమ్‌లో ఆన్‌లైన్ కోచింగ్ తీసుకుంటున్న సమయంలో తన తండ్రి, సోదరుడు విద్యుత్ ప్రమాదంలో మరణించినప్పుడు, నల్లగొండ ఎకనామిక్స్ ఫోరమ్ అధ్యక్షులు డా. అక్కెనపల్లి మీనయ్య చొరవతో సర్వ్ ది పీపుల్ ఫౌండేషన్ బాధ్యులు నాతి గణేష్ తన ఎం .ఏ. ఎకనామిక్స్ రెండేళ్ల చదువుకు సంబంధించిన అన్ని ఖర్చులను భరించిన విషయాన్ని ప్రిన్సిపాల్ రజినికి తెలియజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ రజిని, డా. అక్కెనపల్లి మీనయ్యతో ఫోన్‌లో మాట్లాడి శృతి పరిస్థితిని వివరించారు. ఈ విషయాన్ని సర్వ్ ది పీపుల్ ఫౌండేషన్‌కు తెలియజేయగా, ఫౌండేషన్ బాధ్యులు నాతి గణేష్ వెంటనే స్పందించి అనంతపు రం సెంట్రల్ యూనివర్సిటీ ఖాతాలో 32,050 జమ చేశారు. ఈ సందర్భంగా నాతి గణేష్ మాట్లాడుతూ, శృతి కోర్సు పూర్తయ్యే వరకు ఫౌండేషన్ తరఫున అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందిస్తామని తెలిపారు. ఫౌండేషన్ అందించిన ఆర్థిక సహాయంపై కళాశాల ప్రిన్సిపాల్ రజిని, ఎకనామిక్స్ ఫ్యాకల్టీ ప్రొద్దటూరు శ్రావణి హర్షం



వ్యక్తం చేశారు. డా. అక్కెనపల్లి మీనయ్య మాట్లాడుతూ, నాతి గణేష్ నల్లగొండ ఎకనామిక్స్ ఫోరమ్‌లో లైఫ్ మెంబర్‌గా ఉండటంతో పాటు, నాతి శ్రీనివాస్, ఎస్ ఎల్ ఎన్ ఫౌండేషన్‌లతో కలిసి అనేక మంది పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. పేద విద్యార్థుల ఉన్నత విద్యకు ఇలాంటి దాతలు అందిస్తున్న సహకారం ఎంతో ప్రోత్సాహకరమని అన్నారు. విద్యార్థుల ఉన్నత విద్యకు ఆర్థిక పరిస్థితులు అడ్డంకిగా మారకుండా సమాజంలోని దాతలు ముందుకు రావాలని ఈ సందర్భంగా కోరారు.

# మల్లారెడ్డి 'సారం'... రైతు సమాజానికి ప్రాణం!



**నల్లగొండ -ఆగస్టు 25(సత్యనిష్ఠ ప్రతినిధి)**
రైతాంగంపై కొత్త విధానం వచ్చింది.. దాని లోతుపాతులు చెప్పేదెవరు? కొత్త ప్రాజెక్టు తెరపైకి వచ్చింది.. దాని సాధ్యాసాధ్యాలు తేల్చేదెవరు? పంట ధర పతనమైంది.. దాని వెనుక కారణాలను రైతుకు అర్థమయ్యేలా వివరించేదెవరు? నదీజలాల వివాదం రగిలింది.. నిజానిజాలను నిగ్గుతేల్చేదెవరు? ఇలాంటి ప్రతి ప్రశ్నకూ ఠక్కున గుర్తుకొచ్చే పేరు సారంపల్లి మల్లారెడ్డి.

చదివింది పదో తరగతే. కానీ ఆంగ్లభాషపై అపారమైన పట్టు. ఏ విశ్వవిద్యాలయంలో చదవలేదు. కానీ విశ్వవిద్యాలయ విద్యార్థులకే పాఠాలు చెప్పగలిగేంత పరిజ్ఞానం. పంట ఏదైనా.. ప్రాజెక్టు ఏదైనా.. అంశం ఏదైనా.. దాని లోతుపాతులను వేళ్ల మీద లెక్కించినట్లు వివరించేవారు. వ్యవసాయం నుంచి సాగునీటి వరకు.. భూహక్కుల నుంచి కార్పొరేట్ వ్యవసాయం వరకు.. నదీజలాల నుంచి ప్రపంచ ఆర్థిక విధానాల వరకు ఆయన అధ్యయనానికి హద్దులు లేవు. రైతు నాయకుడే కాదు.. రైతులా ఉట్టిపడిన అరుదైన మేధావి.

అంతటి మేధస్సు.. అంతటి పరిజ్ఞానం.. అయినా ఆయనలో ఇసుమంతైనా గర్వం కనిపించేది కాదు. నిస్వార్థపరుడు.. నిజాయితీపరుడు.. నిరాడంబరుడు. తెల్లని అంగీ.. భుజాన పచ్చని తువాలు.. ముఖంపై చిరునవ్వు. ఆయన నడిచి వస్తుంటే ఓ రైతు నడిచి వచ్చినట్టే ఉండేది. హోదా ఎంత పెరిగినా పలకరింపులో తేడా ఉండేది కాదు. చిన్నవారినీ పెద్దవారినీ ఆప్యాయంగా పలకరించేవారు. మాటలో మంచితనం.. మనసులో కల్మషం లేని స్వభావం.. వ్యవహారంలో అనురాగం.. విమర్శలోనూ ఆప్యాయత.. ఇవన్నీ ఆయన వ్యక్తిత్వానికి సహజ లక్షణాలు. ఎదిగే కొద్దీ ఒదిగిన మనిషి. పదవులు పెరిగినా.. మనసు మాత్రం పల్లె మనిషిదే.

చదువు పదో తరగతితో ఆగిపోయింది. కానీ నేర్చుకోవడం మాత్రం చివరి శ్వాస వరకు సాగింది. పుస్తకాలు చదివారు.. ప్రజలను చదివారు..
ఎా లా ల ను
పరిశీలించారు.. విధానాలను అధ్యయనం చేశారు. ఎనభై దాటిన వయసులోనూ కంప్యూటర్‌తో కుస్తీ పడుతూ కొత్త విషయాలను తెలుసుకున్నారు. తన జ్ఞానాన్ని యువతతో పంచుకున్నారు. నిత్య అధ్యయనశీలి.. నిరంతర శోధకుడు.. జ్ఞానాన్ని తనకే పరిమితం చేసుకోని మేధావి.

యువకుడిగా ఉన్న రోజుల్లో ఓంకార్ వంటి కమ్యూనిస్టు నాయకుల పరిచయం, పుచ్చలపల్లి సుందరయ్య వంటి నేతల ప్రజా ఉద్యమాల ప్రభావం ఆయనను కమ్యూనిస్టు భావజాలం వైపు నడిపించాయి. నర్సంపేట ప్రాంతంలో పార్టీ నిర్మాణానికి కృషి చేశారు. రైతులు, కూలీలు, పేదల సమస్యలపై పోరాటాల్లో పాల్గొన్నారు. పోలీసుపటేల్‌గా పనిచేసిన సమయంలోనూ ప్రజల పక్షాన నిలిచారు. 1971లో తిమ్మంపేటలో జరిగిన ఘటనల అనంతరం ఆ పదవిని కోల్పోయారు. అధికారాన్ని పట్టుకొని ఉండటం కంటే ప్రజల పక్షాన నిలవడానికే ప్రాధాన్యమిచ్చారు. 1973లో సీపీఎం పూర్తి కాలం కార్యకర్తగా బాధ్యతలు చేపట్టి జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి నాయకత్వం వరకు ఎదిగారు.

సీపీఎం పార్టీ నిర్మాణంలో ఆయనది ప్రత్యేక ముద్ర. నర్సంపేట ప్రాంత కమిటీ నుంచి వరంగల్ జిల్లా కమిటీ, జిల్లా కార్యదర్శివర్గం, రాష్ట్ర కమిటీ, రాష్ట్ర కార్యదర్శివర్గం వరకు వివిధ బాధ్యతలు నిర్వహించారు. అనంతరం పార్టీ కంట్రోల్ కమిషన్‌లోనూ పనిచేశారు. పార్టీని కేవలం రాజకీయ సంస్థగా కాకుండా కష్టజీవుల హక్కుల కోసం పోరాడే వేదికగా భావించారు. ప్రజాసంఘాల బలోపేతానికి, రైతాంగ ఉద్యమాల విస్తరణకు జీవితాంతం కృషి చేశారు.

రైతు సంఘం ఆయన జీవిత ప్రస్థానంలో మరో ముఖ్య అధ్యాయం. నర్సంపేట డివిజన్ రైతు సంఘం కార్యదర్శి నుంచి వరంగల్ జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర రైతు సంఘం ఆఫీస్ బేరర్‌గా, అధ్యక్షుడిగా, కార్యదర్శిగా పనిచేసి.. అఖిల భారత కిసాన్‌సభ ఉపాధ్యక్షుడిగా ఎదిగారు. భూమి, సాగునీరు, పంట ధర, రుణభారం, మార్కెట్, ప్రభుత్వ విధానాలు.. ప్రతి అంశాన్నీ రైతు కోణంలో పరిశీలించారు. పేదల భూముల పరిరక్షణ కోసం భూపోరాటాల్లో పాల్గొన్నారు. శ్రీరాంసాగర్ రెండో దశ వరద కాలువల కోసం ఉద్యమించారు. తిమ్మంపేట సర్పంచ్‌గా, సింగిల్‌విండో అధ్యక్షుడిగా గ్రామాభివృద్ధికి కృషి చేశారు.

ఆయన అధ్యయనం ప్రసంగాలతో ఆగిపోలేదు.. అక్షరాలుగా మారింది. 'రైతు ఉద్యమ చరిత్ర 1947--2007', 'బడుగు రైతుల వెతలు', 'కమిషన్లు-రికమండేషన్లు', 'కార్పొరేట్ వ్యవసాయం', 'రాష్ట్రంలో నదీజలాలు--ప్రాజెక్టులు--వినియోగం--వివాదాలు', 'తెలంగాణలో సాగునీటి వనరులు--అవకాశాలు', 'తెలంగాణ రైతాంగ భూ ఉద్యమాలు', 'వ్యవసాయ సంక్షోభంలో రైతులు దిక్కా', 'సహకార రుణాలు', 'రైతు బంధువులారా! ఆలోచించండి!!', 'రైతు సంక్షేమం-ప్రభుత్వంలో రైతు మేలెంత', 'భారత రైతాంగపోరాటాలు' తదితర పుస్తకాలు రచించారు. నదీజలాలు, సాగునీటి వనరులు, మైనర్ ఇరిగేషన్, కార్పొరేట్ వ్యవసాయం, ప్రపంచబ్యాంకు సంస్కరణలు, రైతాంగ భూపోరాటాలపై విస్తృతంగా అధ్యయనం చేశారు. పండితులకే పరిమితమైన విషయాలను పామరుడికి అర్థమయ్యే భాషలో చెప్పడం ఆయన ప్రత్యేకత.

ఇప్పుడు ఆ స్వరం లేదు. రైతాంగ సమస్యపై ప్రశ్నిస్తే లోతుపాతులు విప్పి చెప్పే ఆ మేధస్సు లేదు. కానీ ఆయన పుస్తకాలు ఉన్నాయి. పోరాట చరిత్ర ఉంది. అక్షరం ఉంది. ఆలోచన ఉంది. జీవితమంతా ప్రజల కోసం అంకితం చేసిన మల్లారెడ్డి.. మరణానంతరం తన భౌతికకాయాన్ని వైద్య విద్యార్థుల పరిశోధనకు అందిస్తూ చివరి అడుగునూ సమాజానికే అంకితం చేశారు.

ఒక రైతు నాయకుడు దూరమయ్యారు.. ఒక మేధావి మౌనమయ్యారు.. ఒక రచయిత కలం ఆగిపోయింది. కానీ ఆయన ఆలోచన ఆగదు.. ఆయన అక్షరం ఆగదు.. ఆయన పోరాట స్ఫూర్తి ఆగదు.

రైతు సమస్యపై ప్రశ్న వచ్చిన ప్రతిసారీ.. నిజానిజాలను నిగ్గుతేల్చే ప్రయత్నం జరిగిన ప్రతిచోటా.. మల్లారెడ్డి విశ్లేషణల పాఠాలు మళ్లీ వినిపిస్తూనే ఉంటాయి.

**జోహార్లు కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి!**



రచయిత-- గడగోజు రవీంద్ర చారి..

# పుట్టినరోజు వేడుకలకు దూరంగా ఉండి మృతుడి కుటుంబానికి అండగా నిలిచిన మాజీ ఎమ్మెల్యే కంచర్ల

**నల్గొండ -- ఆగష్టు 25 ( సత్య నిష్ట):** ఫ్లెక్సీ కడుతూ విద్యుత్ షాక్‌తో మృతి చెందిన కేసాని రాజశేఖర్ రెడ్డి కుటుంబానికి ఆపద్బాంధవుడుగా నిలిచిన మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి తన పుట్టినరోజు వేడుకలకు దూరంగా ఉండి ఇచ్చిన మాటను ఇరవై నాలుగు గంటల్లోనే నెరవేర్చారు.కట్టా అన్నారంలో రాజశేఖర్ రెడ్డి పార్థివదేహానికి నివాళులర్పించి,అంత్యక్రియల్లో పాల్గొని కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న కుటుంబ సభ్యులను పరామర్శించి నేనున్నాను అధైర్యపడొద్దు అంటూ ధైర్యం చెప్పి రాజశేఖర్ రెడ్డి మూడున్నరేళ్ల



కుమారుడు, ఏడాది పాపను చూసి చలించిపోయి అతని పిల్లల భవిష్యత్తుకు అండగా ఉంటాం అని మృతుడి కుమారుడు, కుమార్తె పేర్లపై చెరో నాలుగు లక్షల చొప్పున మొత్తం ఎనిమిది లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి పత్రాలను కుటుంబానికి అందజేశారు. కార్యకర్తల సహకారంతో ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా కుటుంబానికి ఆపన్నహస్తం అందించినట్లు వెల్లడి ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎం.సి. కోటిరెడ్డి, రాష్ట్ర పార్టీ నాయకులు కంచర్ల కృష్ణారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షులు రేగట్టె మల్లికార్జున రెడ్డి, నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, గోన రవీందర్ రావు, నగర పార్టీ అధ్యక్షులు బోనగిరి దేవేందర్, కనగల్ నల్గొండ మండల పార్టీ అధ్యక్షులు ఐతగోని యాదయ్య, దేప వెంకటరెడ్డి, కార్పొరేటర్లు మారగోని గణేష్, రావుల శ్రీనివాస్ రెడ్డి, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.